కథ

# ఇప్పుడే అందిన వార్త

డా. పాలకోడేటి సత్యనారాయణరావు

**భూ**లోకం అంతా బహు సందడిగా ఉంది.

మానవులంతా ఆశ్చర్యపోతున్నారు - మానవాళి చరిత్రలో ఎన్నడూ ఎరగని కొత్త సంగతి చోటు చేసుకోవడమే దానికి కారణం!

శాస్త్రజ్ఞులూ సంబరపడిపోతున్నారు. ఎంత అభివృద్ధి సాధించినా, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో రకాల మార్పు చేర్పులకు దోహదపడినా, ఇంతవరకూ తన ఆయుష్షును పెంచుకోగల పద్ధతులు మాత్రం మానవుడికి తెలియరాలేదు!!

ఇంతకాలం తమకు కొరుకుడు పడని అంశం, తాము కలలోనూ ఊహించని విషయం - ఇప్పుడు దానంతట అదే తెలియవచ్చే అవకాశం రావటం..

మానవులకు పండుగలాగే ఉంది!!



వైకుంఠంలో పాలకడలి కెరటాలు ఎగిసి ఎగిసి పడుతున్నాయి. విష్ణుమూర్తివారు పాలకెరటాలపై, శేషతల్పం మీద వయ్యారంగా శయనించి ఉన్నారు. ఆ స్వామి పాదాల చెంత లక్ష్మీదేవి పద్మాసనం మీద కూర్చుని, సుతారంగా స్వామివారి పాదాలను పడుతోంది. వాళ్లను చూసిన ఎవరికైనా, ఈ విశాల విశ్వం అంతా క్షేమమేనన్న అభిప్రాయం కలగక మానదు.

అయితే, మనం ఒకటి ఊహిస్తే దైవం మరొకటి ఆశిస్తుందన్న రీతిలో కాబోలు, ఎక్కడో దూరంనుంచి హాహాకారాలు వినవచ్చాయి. భక్తుల మొరలు వినటం అలవాటవటంతో, శ్రీహరి కుయ్యాలించక మునుపే, ఆ హాహాకారాలు రానే వచ్చాయి. వెంటనే, ఓ చెవిని అటు పడేసిన విష్ణుమూర్తి వర్యులకు విషయం అర్థమయింది. తల పంకించి, మళ్లీ తన చిద్విలాస మందహాసం కొనసాగించారు.

ద్వారపాలకులలో ఒకరైన విజయుడు పరుగు పరుగున వచ్చాడు.


"స్వామీ! స్వయంగా బ్రహ్మగారు నేరుగా వచ్చేశారు, ప్రవేశ పెట్టమని ఆనతా?" అని అతి వినయంగా అడిగాడు.

విష్ణుమూర్తి చిరునవ్వుతో, తల ఊపారు. విజయుడు బహు వినయంతో వెళ్లిపోయాడు.

క్షణకాలంలోనే, బ్రహ్మదేముడు లోనికివిచ్చేశాడు.

"తండ్రీ! నమస్కారం!!" అంటూ గౌరవ సూచకంగా అభివందనం చేశాడు బ్రహ్మ.

"ఏం ఆపద ముంచుకొచ్చింది నాయనా? సృష్టి చేయాల్సిన పనిని పక్కన పెట్టి, ఇంత ఆదరాబాదరాగా



వచ్చావ్?'' అని ఆరా తీశారు విష్ణుమూర్తి.

''ఆపద అని నెమ్మదిగా అంటారేమిటి నాన్నగారూ! నా కొంప మునగబోతోంది!! భూలోకంలో.. అందునా మన వేదభూమి, పుణ్యభూమి భారతదేశంలో సాధారణ ఎన్నికలు జరగబోతున్నాయి కదా..''

''అది ప్రతీ అయిదేళ్లకూ జరిగే కార్యక్రమమే కదా! ఇప్పుడే ఏం కొత్తగా కొంప మునుగుతోందో చెప్పు'' అన్నారు విష్ణుమూర్తి వారు.

''ప్రతీ ఎన్నికల సమయంలోనూ మనం ఇలాగే అనుకోవటం పరిపాటే కదా తండ్రీ! కానీ, ఈ సారి పూర్తిగా తన కొంప మునిగిపోయే కాలం వచ్చేస్తోందని తల్లి భూమాత గగ్గోలు పెట్టేస్తోంది! మాతృమూర్తి ఆ విషయం మీతో మొరపెట్టుకున్నా, మీరు పెడచెవిన పెడుతున్నారనీ తల్లి ఆవేదన!! అందుకే, ఈ సారి ఆ బాధ్యతను నామీద మోపింది అమ్మ!!'' బ్రహ్మ అంటున్నది వింటున్నా, విననట్లు ఉండిపోయారు విష్ణుమూర్తి వారు.

భూదేవి తనతో మాట్లాడేది పనిగట్టుకుని మరీ, లక్ష్మీదేవి ముందు వల్లెవేయాలా!! ఈ బ్రహ్మకు చెప్పుకునేందుకు నాలుగు తలలు ఉన్నాయి గానీ, ఆ నాలుగింటిలో దేంట్లోనూ కొంచెమైనా గుజ్జు అన్నది ఉన్నట్లు లేదు!!

''ఇంతకీ, విషయం ఏమిటో చెప్పావు కాదు!!''

''ఏముంటుంది కొత్త విషయం.. మోయగలిగినంత కాలం పూర్తి సహనంతో పాపులను, వారి పాపాలను మోసిన తల్లి దినదిన ప్రవర్ధమానవుతున్న పాపులను ఇక మోయటం తనవల్ల కాదంటోంది. ముఖ్యంగా ఎన్నికల వేళ ఇంకా పాపం పెచ్చరిల్లే ప్రమాదం ఉందని తల్లి ఆందోళన! ఆ వసుంధర ఏ క్షణంలో కాడి వదిలేస్తుందో.. అస్సలు తెలియటం లేదు!'' ఎంతో ఆవేదనతో అన్నాడు బ్రహ్మ.

నిజమే- ఈ సమస్య కొత్తది కాదు.. యుగయుగాలుగా ఉన్నదే! భూదేవి తన వద్ద అనేకమార్లు మొరపెట్టుకున్నదే! పాపం పూర్తిగా పండితేగానీ, కొత్త అవతారం దాల్చే పద్ధతి లేనేలేదుమరి.. ఈ లోగా ఏదైనా మార్గాంతరం ఆలోచించాల్సిందే!!

''ఏం చేద్దామంటావ్, చెప్పు!!'' అడిగారు విష్ణుమూర్తి వారు.

''చిన్న ఆలోచన ఉన్నమాట నిజం! పాపాలను తగ్గించాలన్నా, పుణ్యాలను, పుణ్య పురుషులను పెంచాలన్నా ఒక్కటే మార్గంగా తోస్తోంది నాన్నగారూ!! వాస్తవానికి నాకీ ఆలోచన వచ్చింది కూడా భూలోక వాసుల్ని చూశాకే!! వాళ్లు ప్రతీ దానికీ ఓ ప్రోత్సాహకాన్ని ఇస్తారు! ఇది కూడా అంతే అనుకోండి!!''

''సరే, ముందు ఆ ఆలోచన ఏదో చెప్పు!!''

''చిన్న ఆలోచనే!! భూలోకంలో ఎవరికైనా ఒక్కటే ఆశ! దాన్ని దృష్టిలో ఉంచుకుని సిద్ధం చేసిన పద్ధతే ఇది! అక్కడ ఎవరికైనా కావాల్సింది ఒక్కటే.. అది చిరకాలం బతికి ఉండటం! నీతిమంతుల్ని బతికించుకోవాలన్నా, నీతిని పెంచుకోవాలన్నా, మనం కొందరం నీతిమంతుల్ని ఎంచుకుని, వారికి ఆయుష్షు పెంచటమే మార్గంగా కనిపిస్తోంది మాకు'' అన్నాడు బ్రహ్మ.

విష్ణుమూర్తి ఒక్కసారి ఉలిక్కిపడ్డారు.. సృష్టి స్థితి లయ సూత్రాలకు విరుద్ధంగా కొందరికి అధిక

ఆయుష్షను అందించటమా! ఇది ధర్మ విరుద్ధం కదా!! ఆ మాటే అన్నారు విష్ణుమూర్తి వారు.

"ఆ మాట నిజమే నాన్నగారూ! భూమాత, నేనూ ఆ విషయం కూడా ఆలోచించాం! ఈ విషయంలో సృష్టికర్తనైన నాకు, స్థితికారకులైన మీకు ఎలాంటి అపకీర్తి రాకుండా ఏం చేయాలా అని కూడా తర్జనభర్జనలు పడ్డాం!! నీతిమంతులైన వారిని ప్రజలే గుర్తించినట్లయితే, వారికి శతాధిక సంవత్సరాల ఆయుష్షను ఆందించటం కష్టం కాదని మా ఉద్దేశ్యం! ఎవరు నీతిమంతులో ఎన్నికల ద్వారా ప్రజలే నిర్ణయిస్తారు కాబట్టి, మన చేతికి మట్టి అంటదని మా ఇద్దరి ఏకాభిప్రాయం! దీనికి మీ అనుమతీ లభిస్తే, మేం మిగిలిన ప్రయత్నాలలో పడతాం!" అన్నాడు బ్రహ్మ.

క్షణకాలం ఆలోచించారు విష్ణుమూర్తి వారు. ఆయనకు భవిష్యత్తు అంతా కానవస్తూనే ఉంది. అయినా.. తల్లీ కొడుకుల ఆలోచనను కాదనటం దేనికన్నట్లుగా "సరే, అలాగే కానివ్వండి! కానీ, ఈ వార్త భూలోక వాసులకు తెలిసేది ఎట్లా?" అడిగారు విష్ణుమూర్తి.

"ఆ విషయమూ ఆలోచించాం మేం! దానికి త్రిలోక సంచారి అయిన నా కుమారుడు నారదుడు ఉండనే ఉన్నాడు గదా!!" అన్నాడు బ్రహ్మ.

"జాగ్రత్త కుమారా! నారదుడికి కలహప్రియుడన్న బిరుదు ఉన్నమాట మర్చిపోకండి! కోరి కొత్త కలహాలను తెచ్చుకోకండి!!" అంటూ సలహా ఇచ్చారు విష్ణుమూర్తి.

సరేనంటూ తల ఊపి, తమకు తట్టిన కొత్త ఆలోచనను అమలు చేసేందుకు బ్రహ్మ వెంటనే సత్యలోకానికి పయనం కట్టాడు.

***

భూలోకం అంతా మహాసందడిగా ఉంది. అదృష్టం అంతా తమదేనన్న భావం అంతటా వ్యాపించిపోయింది.

ఎవరికో నారదులవారు దర్శనం ఇచ్చి 'ఇకపై ప్రజలు ఎన్నుకున్న అత్యుత్తమ నీతిమంతులకు వారు కోరుకున్నంత ఆయుష్షు లభిస్తుంద'ని చెప్పారట! ఆ వార్త క్షణాల మీద భూలోకం అంతా పాకిపోయింది.

ఎవరినోట విన్నా ఇదే మాట!! ఏ ఛానల్ లోనైనా ఇదే ఫ్లాష్ న్యూస్!!

కొన్ని టీవీల వాళ్లు 'ఏఏ అర్హతలు ఉంటే నీతిమంతులు?' అనే ప్రోగ్రామ్‌లను రన్ చేస్తే, మరికొన్ని ఛానళ్ళు 'గతకాలం నీతిమంతులు – మన ముందు నీతిమంతులు' అనే సిరీస్‌లను మొదలు పెట్టాయి. ఇంకొన్ని ఛానళ్లు ఏకంగా 'ఎవరు మనలో మహానీతిమంతులు?' అంటూ యస్సెమ్మెస్ పోల్స్ కూడా ఆరంభించాయి. అసలైన 'నీతిమంతుల ఎన్నిక' ఎప్పుడు జరుగుతుందోనన్న ఆత్రుత, ఊహాగానాలు కూడా మొదలయ్యాయి.

ప్రతిమనిషి మనసులోనూ ఒకటే ఆశ, ఆలోచన – 'నాకు ఉంటుందా ఈ లక్కీఛాన్స్?' అనేదే!!

చిరంజీవులుగా కాకపోవచ్చు, సుదీర్ఘాయువుగా ఉండగల అవకాశం మాత్రం ఈ విశ్వంలో బహుశా ఏ జీవికీ ఉండి ఉండకపోవచ్చు. స్వచ్ఛంద మరణం అనేది భీష్ముడికి ఉన్న వరమని మహాభారత కావ్యంలో చదివిన విషయమే కానీ, అందులో ఎంత నిజం ఉందో ఎవ్వరూ చెప్పలేరు.

సుదీర్ఘాయువుగా ఉండగలిగేది మాత్రం నీతిమంతులేనట!! అదీ ఎన్నికల పద్ధతిలో ఎన్నుకోబడిన వారికేనన్నది కొసమెరుపు!!

'నాకు ఉంటుందా ఈ లక్కీఛాన్స్?' అని అందరిలాగే క్షణకాలంపాటు సీరియస్‌గా ఆలోచించాడు సత్యమూర్తి.

గతంలో ఎప్పుడూ ఆలోచించని విషయమిది.. అయినా, జవాబు వెంటనే తట్టనే తట్టింది.. 'అది తనకు దక్కేఅవకాశం కాదు. వెనక్కు తిరిగి చూసుకుంటే, ఎక్కడో తను నీతి తప్పినట్లే ఉంది! గుండె మీద చెయ్యి వేసుకుని తను నీతిమంతుడినేనని చెప్పనేలేడు! ఇక తనకు ఆ ఛాన్స్ ఏది?' సత్యమూర్తి ఖచ్చితంగా నిర్ధారించుకున్నాడు.

'అయితే, మరి అంత నీతిమంతుడు ఎవరై ఉంటారు? ఆ అదృష్టం ఎవరికి దక్కేను!' ఆలోచనలో పడ్డాడు సత్యమూర్తి.

ఎంత ఆలోచించినా, ఒక్క పేరూ తట్టలేదు సత్యమూర్తికి.

ఏ ఒక్కరి పేరు ఆలోచించినా, వారి వెనక అనేకానేకమైన మచ్చలు!!

ప్రతి ఒక్కరూ పైకి వేరుగా కనిపిస్తున్నా, లోన మాత్రం అచ్చమైన గురివిందలు!!

ఏ నాయకుడి పేరు ఆలోచించినా, అదే పరిస్థితి!!

మరి ఎవరు ఎన్నిక అవుతారు? అందరి మదిలోనూ అదే ప్రశ్న!! అదే ఉత్కంఠ!!

సత్యయుగంలో నాలుగు పాదాల, కృతయుగంలో మూడుపాదాల, ద్వాపర యుగంలో రెండు పాదాల, కలియుగంలో ఒక్కపాదంతో నడుస్తూ, నేడో రేపో కూలిపోతుందన్న భావన అందరిలోనూ పెరిగిపోయిన నీతిని మళ్లీ నిలబెట్టేందుకు, నీతిపరులకు పట్టం కట్టేందుకు, అత్యంత నీతిమంతుల కోసం ఎన్నికను ప్రకటించారు.


కనీసం ఒక్కరైనా, తాము నీతిమంతులం అని చెప్పుకుంటూ, పోటీకి దిగ గలుగుతారా.. అంత ధైర్యం ఓ ఒక్కరికైనా ఉంటుందా అని అందరూ ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తున్న ఈ రోజులలో .. ఎందరో బరిలో ఉండటం అందర్నీ నివ్వెర పరిచింది.

మళ్లీ ఇదొక సంచలన వార్త అయింది. ఛానళ్లకు మళ్ళీ చేతినిండా, ప్రోగ్రాముల నిండా పని అయింది.

పోటీలో ఉన్న ఒక అభ్యర్థిని ఓ ఛానల్ ఇంటర్వ్యూ చేస్తూ, దాన్ని ప్రత్యక్ష ప్రసారం కూడా చేసింది.

"... నిజంగా మీరు అంత నిజాయితీ పరులని మీ ఉద్దేశ్యమా? కనీసం ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం చెప్పండి!" అని యాంకర్ అడిగితే, ఆ అభ్యర్థి ఇచ్చిన సమాధానం చిత్తగించండి.

"మీకూ, మీ ఛానళ్లకు తెలియని విషయం కాదిది!! ఈ భూప్రపంచంలో ఎక్కడ వెతికినా, ఒక్క నీతిపరుడైనా ఉంటాడని నేనైతే అనుకోవటం లేదు! అవినీతి అనేది గ్లోబల్ ఫెనామెనా అని మన దేశనాయకురాలు ఏళ్ల క్రితమే ప్రకటించేశారు! ఇంకా మేం చెప్పేది ఏం ఉంటుంది! ఉన్న అభ్యర్థుల్లో తక్కువ అవినీతి పరుడికే ఈ ఎన్నిక అని నా అభిప్రాయం! అయినా, ఒక్కమాట..!" అంటూ, యాంకర్‌గారి చెవి దగ్గరగా వచ్చి నెమ్మదిగా అన్నాడు "... మీ ఛానళ్లతో ఇదే చిక్కు! ఏం చెప్పినా క్షణాల్లో విశ్వవ్యాప్తం చేస్తారు! ఆఫ్ ది రికార్డ్‌గా ఒక్కమాట చెప్తా.. బ్రహ్మదేవుడి కంప్యూటర్ అటు వైరస్ పాలవటమో, కాకపోతే, ఇటు చిత్రగుప్తుడి చిట్టా చెదలపాలవటమో జరిగి ఉంటుందని నా అభిప్రాయం!! లేకపోతే, ఇంతకాలం లేనిదీ, మనం కనీ వినీ ఎరగనిదీ.. ఈ ఎన్నిక గదా! ఏ యుగంలోనూ జరగనిది ఇప్పుడీ కలికాలంలో ఎందుకు పెట్టారంటారు చెప్పండి... అదే కారణం.. లేకపోతే, డేటా అంతా వాళ్ల దగ్గరే సిద్ధంగా ఉండి ఉంటే మనకీ ఛాన్స్ ఇచ్చేవారా.. ఏ మార్కండేయుడికో, ప్రహ్లాదుడికో, ఆంజనేయుడికో ఇచ్చినట్లుగా, ఏ భక్తుల్నో తమకు నచ్చిన వాళ్లనో సెలక్ట్ చేసేసుకుని, ఆయుష్షను అనంతంగా పోసేసి ఉండేవారు!! కాదంటారా మీరే చెప్పండి!!" అభ్యర్థి అన్నదాంట్లో అక్షరంముక్క అబద్ధం లేదన్నట్లుగా తల ఊపటం మాత్రమే పని అయింది యాంకర్‌కు.




***

ఈ విషయాలన్నీ అశరీరవాణిగా వింటున్న బ్రహ్మదేవుడి గుండెల్లో గుబులు పుట్టించాయి. తాము ఆశించిందేమిటి.. జరుగుతున్నదేమిటి.. కలా.. నిజమా.. తాముసరిగానే విన్నామా.. లేక, ఇది తమ ఊహేనా..

పోటీలో ఉన్న వాళ్లంతా ఇలాంటి వాళ్లేనా..

కాకపోవచ్చు..

కొందరైనా నిజాయితీ పరులు ఉండే

వారుంటారు. అలాంటివారు అసంఖ్యాకంగా ఉండకపోవచ్చు, కనీసం ఒకరిద్దరు దొరికినా భూమ్మీద ధర్మాన్ని తిరిగి ప్రతిష్ఠించడం కష్టం కాక పోవచ్చు.. తప్పో ఒప్పో ఒక ప్రక్రియను ఆరంభించాక, చివరి వరకూ దానిపై నమ్మకం ఉంచి అనుసరించటం సరైన పద్ధతి.

వేచి చూద్దాం, ఏం జరుగుతుందో.. అనుకున్నాడు చతుర్ముఖ బ్రహ్మ. 'ఇంతా చేసిన తర్వాత, తాము ఆశించిన ఫలితం రాకపోతే.. తను ఏ తల ఎక్కడ పెట్టుకోవాల్సి వస్తుందో..' అనీ క్షణం సంశయించాడు కూడా!!

***

పోటీలో ఉన్న మొత్తం అభ్యర్థులను చూసిన ఎవరికైనా,భూలోకంలో, మరీ ముఖ్యంగా భారత దేశంలో అయితే అసలు అవినీతి తక్కువేననీ, నీతి పరుల సంఖ్య అనూహ్యంగా ఉందనీ భావించే అవకాశం ఉంది.

''ఇంతమంది నీతిపరులు ఉండే అవకాశం ఉందా, మీ అభిప్రాయం ఏమిటి?'' అంటూ మళ్లీ ఓ ఛానల్ యస్సెమ్మెస్‌లతో అభిప్రాయ సేకరణ చేస్తే, అందులో ఇకరైతే నిర్మొహమాటంగా ''ఆ, ఏముందీ, షరా మామూలుగా అబద్ధం చెబితే శిక్ష లేకపోవడమే దీనికి కారణం'' అని జవాబిచ్చారు. ఇంకొకరైతే ''పోటీలో ఉన్నవారికి చివరి అవకాశం.. మీరు అవినీతి పరులైతే, వెంటనే ఒప్పుకుంటూ పోటీనుంచి వెంటనే తప్పుకోండి, కఠినమైన శిక్ష పడే ప్రమాదంనుంచి తప్పించుకోండి.. అన్న హెచ్చరిక గనుక నారదుల వారినుంచి వస్తే చాలు, పోటీలో ఒక్కరుంటే నన్ను అడగండి'' అంటూ ఛాలెంజ్ కూడా చేశారు.

అయినా నారదులవారు దీన్ని పట్టించుకున్నట్లు లేదు. ఎవరైనా తప్పుడు సమాచారం ఇస్తే శిక్షల్ని పెంచుతున్నట్లు వార్తలూ, వదంతులూ కూడా రాలేదు.

యథాప్రకారం ఎన్నికలముందు ప్రచారం మొదలైంది. ఎన్నికల్లో గెలిచిన వాళ్లకు ఎంత ఆయుష్షు పెరుగుతుందో తెలియకపోయినా, ఎంత పెరిగినా, ఆఖరికి సూత్రప్రాయంగా ఒక్కరోజు పెరిగినా మంచిదే కదా అన్నట్లు అందరూ భావించడం విశేషం.

మొదటి ఒకటి రెండు రోజులూ అభ్యర్థులు అందరూ భయంభయంగానే ప్రచారం సాగించారు. దీనికి కారణాలు అనేకం. ఇలాంటి ఎన్నికలు జరగటం మొదటిసారి కావటంతో ఏం ప్రచారం చేసుకోవచ్చో, ఏం చెప్పుకోకూడదో ఎవరికీ తెలీని స్థితి. ఇక మరో కారణం – అసలు తాము నీతిమంతులమేనని చెప్పుకోవాల్సిన పరిస్థితి రావటం! 'ఎతం దౌర్భాగ్యం' అన్న భావన ఉండటం!!

రక్తం రుచి చూసిన పులిని ఆ తర్వాత పట్టుకోలేమన్నట్లు.. ఒక్కమూడు నాలుగు రోజులు గడిచేసరికి, పోటీ తీవ్రత అందరికీ అర్థమై పోయింది. ఎలాగైనా, అత్యంత నీతిమంతుడిగా ఎన్నికైతే చాలు నన్న ధోరణి వచ్చేసింది.

''దయచేసి నన్ను మీరు ఎన్నుకోండి..'' అంటూ ఆరంభమైన ప్రచారం క్రమంగా శ్రుతి మించి, తాము ఎదుటి వారికన్నా ఎందుకు గొప్పవారో, ఎంత ఎక్కువ నీతిమంతులో చెప్పుకునే పద్ధతికి మారాయి.

మరో రోజు గడిచేసరికి.. గట్టు దాటి ఎదుటి వారు ఏఏ విషయాలలో నీతిమంతులు కారో వివరించే దశకు చేరింది. 'తానుత్తమ..' స్థాయినుంచి 'వారు కాదు..' దశకు వచ్చింది. అక్కడితో ఆగితే అదీ బాగుండేది..

ఆ తర్వాత రోజుకు మరింత దిగజారింది.. .''ఎదుటి వారు ఉత్తమ కానేకాదు సరికదా, నీచుడు... పరమనీచుడే సుమా!'' అన్న ధోరణి మొదలయింది.

అంతే – కట్టుబాట్లు తెగిపోయాయి.

తమ మంచితనమో, కాకుంటే తమ నీతినియమాల విషయమో మాత్రమే చెప్పుకోవాల్సిన అభ్యర్థులు ఎదుటివారి జీవితాలను జల్లెడపట్టి, ఏనాటివో అయిన నీతిబాహ్యమైన విషయాల కూపీలాగి మరీ, బజారులో పెట్టనారంభించారు.

''మీరునాకు ఓటు వేయండి.. ఆయుష్షు ముందు నాకు పెరిగితే.. ఆ తర్వాత పోరాడి అందరికీ పెరిగేలా చేస్తాను!'' అన్నిది ఒకరి వాదం.
''నాకు ఓటు వేస్తే చాలు.. మీకు కలిగిస్తాను సకల భాగ్యాలు..'' అన్నది మరొకరి నినాదం అయింది!
''ఎప్పుడో పెరిగే భోగభాగ్యాల గురించి ఏం ఆలోచిస్తారు! ఇప్పుడు మీకు కలిగే లాభం చూసుకోండి.. !'' అన్నారు మరొకరు..
ఇక చూడండి.. పోటీ మరింత తీవ్రమయింది.
''నేను ఇచ్చేది ఇంత..'' అని ఒకరంటే, ''నేను ఇస్తున్నది మరింత..'' అన్న వాదవివాదాలు మొదలయ్యాయి.
''మేం ఇవ్వటం.. మీరు తీసుకోవటం ఏమిటి! మీకెంత కావాలో మీరే నిర్ణయించుకోండి'' అంటూ మరొకరు నేరుగా వేలంపాటకు శ్రీకారం చుట్టారు.

''ఫలానా విషయంలో.. ఫలానా వ్యక్తి.. ఇలా ప్రవర్తించినప్పుడు... అతను నీతిమంతుడెలా అవుతాడు?'' అన్న ఆరోపణలు ఆరంభం అయ్యాయి.

బయటపడుతున్న ఆరోపణలలో ఒక్కశాతం నిజం ఉన్నా, ఈ ఎన్నికలు ఎంత హాస్యాస్పదమో అందరికీ అర్థమవుతూనే వస్తోంది.

జారుడుబండల మీదలకు చేరనే కూడదు కానీ, చేరిన తర్వాత ఇక అడ్డూఆపూ ఏదీ ఉండదు. తన గొప్పతనం, ఎదుటివారి డొల్లతనం చెప్పటంతో మొదలైన ప్రచారం దారి తప్పి, తీరు తప్పింది.

''మీరు నాకు ఓటు వేస్తే.. నీతి గెలుస్తుంది, భూమి నిలుస్తుంది''తో ఆరంభమైన ప్రచారం క్రమంగా స్వోత్కర్షకు దారి తీసింది.

ఆ తర్వాత .. కథ లోయలోకి కదిలింది. ఇక, ఒకటే దొర్లుడు.. ఒకటే పరుగు!

''మీరునాకు ఓటు వేయండి.. ఆయుష్షు ముందు నాకు పెరిగితే.. ఆ తర్వాత పోరాడి అందరికీ పెరిగేలా చేస్తాను!'' అన్నిది ఒకరి వాదం.

''నాకు ఓటు వేస్తే చాలు.. మీకు కలిగిస్తాను సకల భాగ్యాలు..'' అన్నది మరొకరి నినాదం అయింది!

''ఎప్పుడో పెరిగే భోగభాగ్యాల గురించి ఏం ఆలోచిస్తారు! ఇప్పుడు మీకు కలిగే లాభం చూసుకోండి.. !'' అన్నారు మరొకరు..

ఇక చూడండి.. పోటీ మరింత తీవ్రమయింది.

''నేను ఇచ్చేది ఇంత..'' అని ఒకరంటే, ''నేను ఇస్తున్నది మరింత..'' అన్న వాదవివాదాలు మొదలయ్యాయి.

''మేం ఇవ్వటం.. మీరు తీసుకోవటం ఏమిటి! మీకెంత కావాలో మీరే నిర్ణయించుకోండి'' అంటూ మరొకరు నేరుగా వేలంపాటకు శ్రీకారం చుట్టారు.

ఆ దెబ్బకు దేశమంతా విస్తుపోయింది!

''ఇలా చేయటం సరైన పద్ధతేనా..?'' అంటూ ఒక యాంకర్,ఆ అభ్యర్థిని ప్రశ్నిస్తే, అతను చిరునవ్వులు చిందిస్తూ ''ఇది జీవితకాల అవకాశం.. మళ్లీ ఇటువంటి సదవకాశం రానేరాకపోచ్చు.. కోరినంత ఆయుష్షు లభిస్తున్నప్పుడు, బతికినంత కాలం ఏదైనా ఎంతైనా పొందవచ్చు.. ఇప్పుడు మన వద్ద ఉన్నది కొంత కోల్పోతే మాత్రం నష్టమేమిటి చెప్పండి..!'' అన్నాడు.

బ్రహ్మదేవుడు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.. 'లబో దిబో..' మంటూ వైకుంఠ మార్గం పట్టాడు.

బ్రహ్మ చెప్పింది విని విష్ణుమూర్తి చిద్విలాస మూర్తిగా అనేక చిరుదరహాసాలను వెలయించారు.

ఆ తర్వాత చిన్నగా అన్నారు ''భారతదేశంలో జరిగే ఎన్నికలను చూసికూడా, నీతిమంతుల కోసం ఎన్నికలను పెట్టిన నీ ధైర్యాన్నే ముందుగా మెచ్చుకోవాలి కుమారా! అత్యంత నీతిమంతులను సైతం అధములుగా, పాపులుగా మార్చే ప్రక్రియ అయింది అది! నీతి మంతులకు అధిక ఆయుష్షును అందిస్తూ, నీతిమంతులను పెంచటం కాదు.. ఉన్న వారిలో నిజాయితీని పెంచే ప్రక్రియ ఏదైనా ఉందేమో ముందు అన్వేషించు.. లేకుంటే, సృష్టికర్తగా దాన్ని సృష్టించే పనిని చేపట్టు.. అత్యవసరంగా!!'' అని ఆనతిచ్చారు.

పూజ్య బ్రహ్మజీ ఇప్పుడు ఆ పనిలో ఉన్నారనేది.. ఇప్పుడే అందిన వార్త!!

*

చిరునామా:
డా. పాలకోడేటి సత్యనారాయణరావు
208, తాజ్ ఎన్‌క్లేవ్, లక్డీకాపుల్,
హైదరాబాద్ – 500004
ఫోన్ : 9848272430